


## మల్లాది విజయరాఘవరావు!

"ధన్ ధనా– టక్ టకా– ధన్ ధనా– టక్‌టకా– తక తకిట– తకతకిట– తకతకిట– తకతకిట ఖండజాతి లయలో శరవేగంతో పరిగెత్తుతోంది రైలు. బెజవాడ రావడానికింకా ఎనిమిదీ గంటలన్నా పట్టచ్చు. పానకాల్రావుకు నిద్ర రావడంలా అమావాస్య చీకటి రాత్రుల్లో చెట్లూ, చేమలూ, గుళ్ళూ– గోపురాలూ, పల్లెలూ– పట్నాలూ, గతంలోకి మాటుమణిగి పోతుంటే, ముందు రాబోయే స్టేషన్లన్నీ భవిష్యత్తులో పొంచి కూర్చున్న ఆశల్లా పుష్పెళ్ళూరిస్తూ పానకాల్రావు మనస్సును పదే పదే పీకుతున్నాయి దగ్గర కొస్తున్న కొద్దీ! అతని తొందర వాటికేం తెలుసు మరీ! ఇవ్వాళన్నా యీ మాయదారి రైలును మరికాస్త తొందరగా పరిగెత్తించే నాథుడే లేడా?! తెలుసు. అల్లా జరగడం అసంభవమని. అయినా బాణం తగిలిన జింకలా కొట్టుకుంటున్న పానకాల్రావు గుండెల్లో తర్కశక్తి నెప్పుడో మింగేసింది ఆవేశం!

"మదర్ సీరియస్... కమ్ సూన్' మామయ్యిచ్చిన టెలిగ్రామిది... ఇదమిద్ధం తెలియడంలా అలాంటి పరిస్థితిలో పానకాల్రావేమిటి, పాపారావైనా– పార్వతమ్మయినా– ఆ సందిగ్ధావస్థలో ఎవరైతేనేం– తడబడక తప్పదు గదా? ప్రాణాలతో తల్లిని చూసి తీరాలి. "నాన్నా! ఎల్లా వున్నావురా? ఎన్నాళ్ళయిందో నిన్ను చూచి!..." అంటూ ఆప్యాయంగా తల్లి బుజ్జగిస్తూ పలికితే, తను– గంగా యమునా సరస్వతు లీదుకుంటూ ఒడ్డు చేరుకుని, స్వర్గానికి నిచ్చెనకట్టి, గంధర్వగానంతో అప్సరసలు నృత్యం చేస్తున్న ఇంద్రసభలో జొరబడ్డట్టు మురిసిపోడూ మరి!

ఏమిటో!!

రాత్రింబవళ్ళూ కవిత్వం రాసే పిచ్చితో ఇలాంటి వూహలే, రైల్లో కూర్చున్నా! తెల్లగా 'ధగ' 'ధగ'లాడే గడ్డం, లాల్చీ, ధోవతీ– 'ఫట్టు'మని పరాయి వాళ్ళు చూస్తే, విశ్వకవి టాగూరు గారి వేలువిడిచిన తమ్ముడిలా కనిపిస్తాడు పానకాల్రావ్! పత్రికలో పని చేస్తున్నారు. సబ్ ఎడిటర్. "క్షణం తీరిక లేదు. దమ్మిడీ ఆదాయం లేదు" అంటుంటాడు పదే పదే అయినా చేసే పనిలో మామిడికాయ రసం తాగుతున్నట్టు సంతృప్తి కనబడడంతో, "మనసు గుర్రం' కళ్ళాలింకా చేజారి పోలేదు! ఎన్నాళ్ళ నుంచో "అమ్మ"ను చూడాలనుకుంటూ, ఢిల్లీ నుంచి బెజవాడకు పోయే విమానాలవీ, రైళ్ళవీ "టైమ్ టేబుల్స్" రోజా తన పత్రికలో అచ్చవుతుంటే బట్టీ పెట్టడం తప్ప, పని కల్పించుకుని టిక్కెట్టుకొని బెజవాడ వైపు ప్రస్థానం చేసే ఘడియలిల్లా తల్లి అనారోగ్యంతో తన్ను పీక్కుతినబోతున్నాయని అతను కలగన లేదెప్పుడూ...

"ధన్ ధనా టక్‌టకా.."

రెండవ తరగతి పెట్టె కిక్కిరిసి, సందు చూలాల్లా కదలలేక కదులుతున్నట్టు తూలుతోంది, అర్ధ నిద్రతో పున్మీలితమైన కొందరు ప్రయాణీకుల కళ్ళల్లో– రైలు....

ఈ మధ్య టి. వి. జోరుకదా! ఆదివార మొస్తే "మహాభారతం" తప్పదందులో కొందరు ప్రయాణీక ప్రేక్షకులకు! కానీ రైల్లో ఎల్లా?! సొంత జీవితపు "భారతం"లోని ఒడుదుడుకులు మరిచిపోవడానికి "మహా భారతం" పుస్తకం చదువు కుంటున్నాడు పానకాల్రావు... అనుకోకుండా వచ్చిన ప్రయాణం గనక "అన్‌రిజర్వుడు" పెట్టిలో ఎలాగో కాళ్ళు ముడుచుకుని కాలక్షేపం చేస్తున్నాడు. బెజవాడ

రావాలి. స్టేషన్లో మామయ్య కనపడి "అమ్మకేం ప్రమాదం లేదులే, భయపడకు పానకాలూ" అనాలి....

"నజాయతే మ్రియతేవా కదా చిన్నాయంభూత్వా భవితా వానభూ యాః..."

"భగవద్గీత"పేజీలు తిరుగు తున్నాయి....

"వాట్ ఎ రాటెన్ రష్?"

సూటూ బూటూ, 'ఫెదర్' హ్యాటూ, చేతిలో వి.ఐ.పి. ఫాన్సీబ్యాగూ, అర్ధరాత్రయినా 'ఆరంజి కలర్' కూలింగ్ గ్లాసులూ.... మిగలక మిగలక మిగిలిన అర ఇంచీ ఖాళీ స్థలం వైపు పానకాలావును "జరగమ"ని "ఫారిన్ జంటిల్మన్" తీవితో సంజ్ఞ చేస్తూ, ఏం జరుగుతున్నదో అర్థం చేసుకునే లోపలే బిత్తర చూపులు చూస్తున్న పానకాలావు పక్కన "దఖీలున" కూర్చుండి పోయాడొక ఆగంతకుడు!!

సంగీత సాహిత్యా లెవరినైనా శాంత మనస్కుల్ని చేస్తాయేమో! హఠాత్తుగా జరిగిన అన్యాయానికి బాధపడుతూ కూడా నెమ్మదస్థుడైన పానకాలావు "ఏమనాలో" తెలీకుండానే"నమస్తే" అనేసి, ఇంకొంచెం జరిగి కూర్చున్నాడా పెద్ద మనిషి "వసతి" కోసం!

"అతిథీ దేవో భవా!"

ఇదీ మన భారతీయుల నిండుతనం!

"ఎందాకా?" తన పై వుద్యోగస్థుడిలా ప్రశ్నించాడా పెద్దమనిషి!

"బెజవాడ."

"ఇంకేం. నేనూ బెజవాడే. ఎప్పుడూ విమానంలో తప్ప ప్రయాణం చేయలేదు. అమెరికా నుంచి మేం దిగి నాల్గురోజులైనా కాలా. అబ్బా! ఇలాంటి చెత్త రైళ్ళల్లో మీరెలా ప్రయాణం చేస్తారర్రా! ఇట్ ఈజ్ ఎ షేమ్! మా వూళ్ళో ఇంట్లోకన్నా రైల్లోనే కమ్మటి నిద్దరొస్తుంది! వాషింగ్టన్‌లో పడుకుంటే, న్యూయార్క్‌లో "బెహరా" వొచ్చి కాఫీ యిచ్చి లేపిందాకా మూసిన కన్ను తెరవళ్ళర్లా.... అది సరేగాని, ఏమిటా పుస్తకం?"

"మహా భారతం."

పానకాలావు కయోమయంగా వుంది. అయినా ఈయన లెక్చర్లువింటూ ఎలాగోలా రాత్రి గడిచి కొంప జేరుకొంటే కొంత ఆదుర్దా తగ్గుతుందేమో! మరి వేరే గత్యంతరం?

"మీకు థ్రిల్స్ కావాలంటే "మహా భారతం" చదివేం లాభమండీ! ఇదిగో "గాన్ విత్ ది విండ్" నేను ముప్ఫయ్యొకటో సారి చదువుతున్నా. మనం బెజవాడ చేరే లోపల మళ్ళీ చదువడం పూర్తయితే మీకిస్తా లేండి... అయినా యీ రైళ్ళల్లో ఫ్యాన్లు బాగు చేసే నాథుడే లేడాండీ! ఇక్కడ గాలిరాదు- కిటికీ తెరవాలంటే సుత్తితో కొట్టినా బిగుసుకు పోయి కదల్దు! చూశారా ఆ "బల్బు"లన్నీ ఎలా పగిలి పోయాయో! వెనక పెట్టెలో బాత్‌రూమ్‌లో నీళ్ళుబొట్టు లేదు. అందుకే ఇక్కడి కొచ్చా. మిమ్మల్ని ఇబ్బందిపెడుత్తూ- పాపం! మీ ఇండియా ఇంకా, స్టోన్ ఏజ్ కాలంలోనే నిద్రపోతున్నట్టుంది! ఇప్పుడు తెలుసా మీకు?" చంద్రలోక మేంటి"- "సూర్యలోక మేంటి"- "అంగారక లోకమేంటి"- చివరకు "బ్రహ్మలోకం"లో కూడా చక్కర్లు కొట్టి, పొద్దున భూమి మీద "టీ" త్రాగి వెళ్ళిన వాళ్ళం, మళ్ళీ భార్యాబిడ్డల్తో పాతాళానికి కొట్టుదానికి రాత్రి భోజనాల వేళ కిల్లు చేరుకోగలం!! గణితమండీ!- అంతా శుద్ధ గణితం మహిమంటే నమ్మండి! అది- అమెరికా అంటే! అలాంటి లెఖ్ఖలు తెలిసిన మహానుభావు డొక్కడైనా మీ వూళ్ళో పుట్టాడా చెప్పండి?!"

ఆవేశంతో వొళ్ళు మండుకొస్తోంది పానకాలావుకు. ఒక్కుమ్మడిగా లేచి "రామానుజం- రామానుజం" అంటూ మన మేథమేటిక్స్ మేధావి పేరు తలుచుకుంటూ, పక్కవాడి పళ్ళు రాలేట్టు చంప చఢారుమని అతికిద్దామనుకున్నాడు... కానీ...

తనలో నివురుగప్పిన నిప్పులా, భూమిగర్భంలో బంగారంలా దాక్కున్న సాహిత్య సంస్కారమలా చేయనిస్తుందా! అసలు వీడెవడు? మన భారతీయుడేనా? చూడ్డానికి మాత్రం అలాగే వున్నాడే! అదేమిటీ- పచ్చి తెలుగు మాట్లాడుతుంటే! ఎరువుకు తెచ్చుకున్న సూటూ బూటూ లాగేస్తే- కళ్ళూ, కాళ్ళూ- ముక్కూ, నోరూ- అన్నీ, మనలాగే వున్నాయి మరి! అయితే ఇంత "దర్జా"గా వాగుతున్న పెద్దమనిషి తనతో "రెండో తరగతి" (అదీ, అన్‌రిజర్వ్‌డ్!)లో దేని కిరుక్కున్నట్టు?!! పోనీ తనకెందుకీ గొడవంతా? తనకున్న దిగుళ్ళు చాలకనా! ఇలాంటి "బేవార్సు" వాళ్ళు గజానికి పదిమంది దొరుకుతారు వెతుక్కుపోతుంటే... అయినా, అతన్ని "బేవార్సు" వాడనుకోవడం తన పొరపాటే అయితే?!! తను మాత్రం విమానంలోనో, ఫస్ట్‌క్లాస్ రైలు పెట్టెలోనో ప్రయాణం చేయగల అర్హత లేనివాడా మరి! అనుకోకుండా తనూ యీ "గర్డ్" పెట్టె "గలీజు"లో కళ్ళు మూసుకుని కాలక్షేపం చెయ్యాల్సిరాలా?! అతనికీ, అలాంటి అవసర ప్రయాణం "కాకతాళీయ న్యాయంగా" తటస్థించిందేమో పాపం!

నెమ్మదిగా అడిగాడు పానకాలావ్.

"మీదసలే వూరండీ?"

"కొన్నాళ్ళు జపాన్‌లో వుండే వాళ్ళం. మా ఫ్యామిలీలో సగం మంది కెనడాలో పెద్ద పెద్ద వుద్యోగాల్లో హేమాహేమీల్లా పని చేస్తున్నారు. నాకో రెండేళ్ళ క్రితం అమెరికాలో వరల్డ్ బ్యాంకులోకి ట్రాన్స్‌ఫర్ అయింది. మీ ఆంధ్రా గవర్నమెంటు వాళ్ళు "బీదల కోసం ఇళ్ళు కట్టించే పథకం" కింద మా దగ్గర నాలుగు మిలియన్ల డాలర్ల అప్పు కోసం దరఖాస్తు పెట్టుకున్నారు. ఆ సందర్భంలోనే, మీటింగ్‌కోసం బెజవాడ వెళ్తున్నా. "సీధా ప్లేన్ లేదు. రైలే తొందరగా చేరుతుం"దని ఎవరో చెప్పారు. అందుకూ యీ రభస!"

న్యాయంగానే వుందతని వుదంతం! కానీ తన అసలు ప్రశ్నకు జవాబు రాలేదింకా. "ఇతను స్వతః తెలుగువాడా, కాదా" అని. ఈ ధర్మసందేహం తీర్చుకుని తీరాలి... అనుకున్నాడు పానకాలావు.

"అవునండీ! రైల్లోనే నయం. ఈ రోజుల్లో విమానాలైనా మనల్ని "టైమ్"కు అందించి చస్తాయి గనకనా... ఒఖ్ఖమాట... మీరు "తెలుగు" ఇంత స్వచ్ఛంగా మాట్లాడుతున్నారు. తెలుగు వాళ్ళేనా?"

ఇంగ్లీషులో సమాధానమిచ్చాడాయన.

"యస్. బేసికల్లీ వుయ్ ఆర్ ఆంధ్రాస్. బట్ నౌ వుయ్ ఆర్ అమెరికన్ సిటిజన్స్".

ఏమైనా, అతనికీ విషయం మీద చర్చ రుచించినట్టు లేదని, అతని ముఖ కవళికలే



చెప్తున్నాయ్!

"ధనాధనా- టక్ టకా "

మ [illegible]మేం మాట్లాడుకుంటున్నా రైలుకేం బట్టిందీ! శరవేగంతో - 'కాలం'లా పరుగెడ్తూనే వుంటుందది! [illegible] కోడ్, పానకాలావు పక్క [illegible] తన సగం సీటు లాక్కుని, 'పారిన్'' వింతలన్నీ ఏకరువు పెడుతూ, సోది కబుర్లు చెబుతున్న మాటే మరిచిపోయి తన కోసం పంచప్రాణాలూ దారబోసే మాతృదేవతను గురించే "పదే "పదే" ఆలోచిస్తూ, ఆమె ఆయురారోగ్యాల కోసం భగవంతుణ్ణి ప్రాధేయపడుతూ, మళ్లీ ప్రయాణ బడలికలో మగత నిద్ర ముంచెత్తుకొచ్చే లోపల, "మహాభారతం" లోంచి "భగవద్గీత" పేజీలు తిప్పటం మొదలెట్టాడు అటు కన్నతల్లి అనారోగ్యపు అశాంతికీ ఇటు యీ ఆగంతకుడి "మాతృదేశ విమర్శ "దాడికీ", "కృష్ణార్జున సంవాద' మే శరణ్యమని నమ్మిన పానకాలావు

ఇంతలో ఆయనన్నాడు "అవర్ డెస్టినేషన్ ఈజ్ నియరింగ్! కొంచెం బాత్రూమ్ కెళ్లొస్తా నా బ్యాగ్‌లో పారెన్ ఎక్స్ఛేంజి కొల్లలుగా వుంది కాస్త జాగ్రత్తగా చూస్తుండండేం'

పానకాలావు కాశ్చర్యమేసింది తలా తోకా తెలియని తన మీద ఎంత "భరోసా" ఈయనకు! "ఆ డబ్బు బ్యాగ్ లోపలికే తీసుకు పోదురూ" అందామనుకుంటున్న తన సమాధానం వినకుండానే

# ఆప్తబంధువు

జనాన్ని తోసుకుని బాత్రూంలో కెళ్లి పోయాడా "ఫారెన్ రిటర్న్!"

"నైనం ఛిందంతి శస్త్రాణి
నైనం దహతి పావకః
నచైనం క్లేదయంత్యాపో
నశోషయతి మారుతః "

ఇలా చదువుతూ, చదువుతూ ఎంత సేపైందో! మైమరచి బాహ్య ప్రపంచంతో సంబంధమే లేనట్టు గాఢమైన సుషుప్తిలోకి చొచ్చుకు పోయింది పానకాలావు మనస్సు మధ్య మధ్య ఎక్కేవాళ్లూ దిగేవాళ్లూ "నీడ నీడ"గా కనబడుతున్నారంటే ఒకసారి టికెట్ కలెక్టరొచ్చి చెక్ చేసి పోతూ పోతూ టాగూర్‌లా అందమైన గడ్డంతో, అపురూపమైన వదనారవిందంతో "మాంచి" పెద్దమనిషిలా కనబడుతున్న పానకాలావు నడిగాడు కూడా "ఇక్కడెవరన్నా టిక్కెట్టు లేకుండా ఎక్కి మిమ్మల్ని అవస్థ పెట్టలేదు కదా సార్? అన్ రిజర్వుడు కంపార్టుమెంట్లల్లో మాకు రోజూ ఇదే గొడవ కదా! అందుకే అడుగుతున్నా"

"అబ్బే! ఏం లేదండీ!"

మాట వరసకనేశాడు పానకాలావు టిక్కెట్ కలెక్టర్‌కు థాంక్స్ చెప్పి

"ధన్ ధనా- టక్ టకా "

తెల్లవారుతోంది. ఈ స్టేషను గాక, ఇంకొక్కటి దాటితే బెజవాడ "ఇడ్లీ కాఫీ' అరుపులు ప్లాట్ ఫారమ్ మీద మోగుతున్నాయి

తన పేరునే వూగుతూ వూగుతూ, వొరబడ కాస్త [illegible] బాత్‌రూమ్‌లో గంటకు [illegible], ముస్తాబై వచ్చిన "పారిన్" పెద్దమనిషి'

"బెజవాడ వచ్చేస్తోంది మీరూ బాత్రూమ్ వగైరా వెళ్లొచ్చి ఫ్రెష్‌గా కూర్చోరాదూ?" ఆప్యాయంగా సొంత చుట్టంలా ఆయన అలా అంటే "వద్ద"న బుద్ధెయ్యలేదు పయనమైనాడు పానకాలావు- కాలకృత్యాలు తీర్చుకోవడానికి


ఖండలయలోంచి ఆదితాళంలోకి దిగి, చివరకు తాళం తప్పినట్టు రైలు రొద ఆగింది నెమ్మది నెమ్మదిగా!

"బెజవాడ వచ్చింది! అమ్మను చూడాలి!

మామయ్య నాకోసం వెతుకుతున్నాడేమో!" అసలు రైలాగినా ఆదురాతో పానకాలావ్ గుండెల్లో కొత్త కొత్త రైళ్ళు పరుగెడుతున్నాయి! బాత్‌రూమ్ తలుపు తీసుకుని, దిగే జనాన్ని తోసుకుంటూ సొంత సీటు దగ్గరకొచ్చేడు

అరే!!

తన పెట్టే, బెడ్డింగూ కూచున్న చోట శూన్యం! ఆ పారిన్ పెద్దమనిషి లేడక్కడ!! పరిగెడుతున్న గుండెకాయ, ఒక్కసారిగా కొట్టుకోడమే మానేసి నట్టయింది! సామాను పోతే పోయింది-అమ్మకు



# యువతా కవిత

## సిగరెట్టు

అందమైన ప్యాకెట్టు
అందులోన సిగరెట్టు
చూపరుల నాకట్టు
రుచి చూస్తే ఓ పట్టు
అలవాటుకి తొలిమెట్టు
వదిలితే మరి ఒట్టు
బ్రతుకంతా తాకట్టు
తోటి వారిని ఇబ్బంది పెట్టు
బడ్జెట్‌కి లోటు పెట్టు
గుండెకు పొగపట్టు
ఊపిరి మెలిపెట్టు
ఆయుష్షని అరికట్టు
అందుకే దానిని దూరంపెట్టు

-పుల్లాపంతుల వేంకటసుబ్బారావు

## భ్రమ

నేననుకున్నా,
ఈ సమాజ మహావృక్షం
చల్లని నీడలో, ప్రేమనుపంచి,

మమతానురాగ మల్లెల
జల్లులు, కురిపించి,
దీన జనావళికి తోడుగా జీవించాలని,

కానీ,
నేనిపుడే తెలుసుకున్నా,
ఇది రాక్షస సమాజమని,
స్వార్థపు విషవృక్షమని,
కులరక్కసి నీలి నీడని,

అందుకే,
రక్తపు మడుగులలో తేలియాడుతున్న
దీన జనావళి ఆర్తనాదాలను వింటూ,
నేను వారితో కలసి పోతున్నానని.

- వై. శ్రీనివాసరావు

## ప్రేమ పావురాలు

నా నీరాజనము నీకై
చేస్తున్నా ప్రతి దినం

గొంతు పెగిలితే
ప్రేమాలాపనలనే వినిపిస్తుంది!

నా చెవులు నీ ప్రేమ
పలుకులే వింటుంది!

నా కళ్ళు నీ ముగ్ధ మనోహర
రూపాన్నే చూస్తున్నవి!

నా అధరాలు నీ లేత బుగ్గలనే
ముద్దిడుతున్నవి!

నా చేతి వ్రేళ్ళు నీ చెక్కిళ్ళను
గిలిగింతలు పెడుతున్నవి!

నా మనస్సు నీ ఒడిలో
ఎప్పుడు ఒదిగి నిద్రిస్తుంది!

నా కలం సిరాను స్రవించి
ప్రేమ కవితలే వ్రాస్తున్నది!

ఇవి నా ప్రేమకు సాక్ష్యాలై
మన ఇరువురిని
అంబర వీధుల్లో

విహరింప జేస్తున్నాయి
ప్రేమ పావురాలుగా!

-సుజశ్రీ

తెచ్చిన మందులన్నీ, అందులోనే వున్నాయి!''

ఏం చేయడమో ఆలోచించే లోపల మామయ్య గొంతు వినిపించింది.

''పానకాలూ- పానకాలూ-''

ఇద్దరూ, పడకగదిలో కొత్తగా పెళ్ళైన భార్యాభర్తల్లా కౌగలించుకున్నారొక్కసారి!

''మామా! అమ్మెలా వుంది!''

''గండం తప్పిందోయ్! నీ కోసమే కలవరిస్తోంది .. పద కూలీని పిలుస్తా సామానేదీ?''

చావు కబురు చల్లగా చెప్పమంటారు! అయినా తల్లిని ప్రాణాలతో చూడగలుగుతున్నానన్న ఆశలో పానకాలావుకు సామాను పోయిన దుఃఖం కించిత్తు కూడా బాధపెట్టలేదా క్షణంలో! గొంతులోంచి చేదు కాకరకాయ కక్కేసినట్టు ''దబా'' ''దబా'' సామాను పోయిన వ్యవహారమంతా మామయ్యతో చెప్పేశాడు పానకాలావ్!

''అరి నీ తస్సదియ్యా పట్నాల్లో కాపురం జేస్తూ ఆమాత్రం జాగ్రత్త లేకపోతే యెల్లాగోయ్! రైలు కదిలే లోపల త్వరగా పదమరి రైల్వే సబ్ ఇన్స్పెక్టర్ మనవాడే. గోపాలంగారు... నడూ నడూ చెప్పి చూద్దాం ''

ఇంకా యేమేమిటో అంటున్నాడు మామయ్య ఈ లోపల కిందటి స్టేషన్‌లో అవతరించిన ''టిక్కెట్ కలెక్ట''రే, మన ''ఫారిన్ గెస్టు'' నొక పోలీసు బంట్రోతుతో సహా నెట్టించుకొస్తూ, వీళ్ళ పెట్టె దగ్గరికి చేరుకున్నాడు!

''ఏమండీ? యీయన టిక్కెట్టు మీ దగ్గరుందా?''

''అదేమిటీ! ఆయన టిక్కెట్టు నా దగ్గరెందుకుంటుందండీ?!

''అయితే ఆయన మీ ''బావమరిది'' కాడా మరి?!'' మామయ్య, పానకాలావు దిగాలుపడి చూస్తున్నారు! వరల్డ్ బ్యాంకు మెంబరు గారి ముఖాన కత్తి వేస్తే నెత్తురు చుక్క లేదు!!

''ఈ కొత్త బావమరి దెక్కడ దాపరించాడో'' అని మామయ్య నిర్ఘాంతపోతున్నాడు!

అన్నాడు పోలీసు బంట్రోతు ''మీరి అతని చేతిలోని యీ పెట్టె మీది మీ చిరునామా, మీ వుద్యోగ వివరాలూ, పేరూ వూరూ, అన్నీ అతనికి ఎంతో పరిచయంలా, గోపాలంగార్ని నమ్మించేశాడండీ!' ఆ వొళ్ళు టిక్కెట్టు ముక్కా చేతిలో లేకపోబట్టి గోపాలంగారి కనుమాన మొచ్చి. సరిగ్గా యీయన గేటు దాటేసుకుంటున్న సమయానికి లంకించుకుని, వాకబు చెయ్యమని మమ్మల్నిలా పంపారండీ!''

''ఓరి బగవంతుడా! నా పెట్టా, బేడా పోకుండా రక్షించడమే కాకుండా, నాకొక, కొత్త ''ఆప్తబంధువు''ను కూడా సృష్టించావు గదరా!

ఫ్యాన్‌లు పని చేయని, బల్బులు పగిలి, కిటికీలు బిగుసుకుపోయిన భారతదేశపు రైళ్ళల్లో హిమాలయాల నుంచి, కన్యాకుమారి దాకా ప్రతిక్షణం వేలాది భారతీయులు దైనందిన కృత్యాల్లో ముగ్ధులై ప్రయాణం చేస్తూనే వుంటారు అవి మన కోసం- మనం వాటి కోసం- జీవిస్తూనే కాలం గడుస్తుంది! అయితే వాటిల్లోనే, ''అమెరికా, ఇంగ్లండు'' వగైరాలూ, ''అంగారక గ్రహం''- ''బ్రహ్మలోకం'' వగైరాలూ, చక్కర్లు కొట్టి, ఎప్పుడోప్పుడు తిరిగొచ్చే సమయానికి టికెట్‌లెస్ ట్రావెల్ కోసం శ్రీకృష్ణ జన్మస్థానం పోబోతూ, మన మన ''బావమరుదు'' లయ్యే సదవకాశం, ఎంత మందికి దక్కుతుందో మరి!!''

అనుకుంటూ ''దేశపు అమ్మనూ'', ''కడుపున కన్నతల్లినీ''- ఇద్దర్నీ తలుచుకుంటూ, మధ్య మధ్య తన విచిత్ర ప్రయాణపు కబుర్లతో సతమత మవుతూ, మామయ్యతో సహా గుర్రబ్బండెక్కాడు పానకాలావ్!!